క్లుప్తంగా

క్షీరాభిషేకం



ఖానాపురం : మహిళలకు వడ్డీలేని రుణాలు ఇవ్వడాన్ని హర్షిస్తూ మహిళా సంఘాల ఆధ్వర్యంలో మండలంలోని బుధరావుపేటలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చిత్రాలతో కూడిన ఫ్లెక్సీకి శనివారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షురాలు పాల్కం ప్రమీల మాట్లాడారు. ప్రభుత్వం వడ్డీ రహిత రుణాలు అందించడానికి నిర్ణయించడం అభినందనీయమని తెలిపారు. మహిళలు వడ్డీ లేని రుణాలు తీసుకుని వ్యాపారాల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీసీ నూరున్నీసా బేగం, వీఓ అధ్యక్షురాలు కొమ్మినేని పద్మ, మహిళా సంఘాల ప్రతినిధులు అరుణ, కృష్ణకుమారి, రేణుక, పసునూరి లత, యాకూబీ, సునీత, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఆహ్వానం



ఖానాపురం : మండలంలోని బుధరావుపేటలో ఈనెల 24న రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న మడేలేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనకు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని నాయకులు ఆహ్వానించారు. ఈ మేరకు ఎమ్మెల్యేను నాయకులు శనివారం కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. విగ్రహ దాతగా, స్థానిక ఎమ్మెల్యేగా వేడుకలకు హాజరై తోడ్పాటు అందించాలని కోరారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు కత్తెరపల్లి రాజు, ఖమ్మంపాటి యాకన్న, లాల్‌సాహెబ్, చాంద్ పాషా, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ జేఏసీ కన్వీనర్‌గా ఫణికుమార్

నర్సంపేట : జిల్లా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రైవేటు, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, పెన్షనర్ల జేఏసీ జిల్లా కన్వీనర్‌గా చెన్నారావుపేట తహసీల్దార్ ఫణికుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చైర్మన్‌గా రాంకిషన్ ఎన్నికవగా టీజీఓ రాష్ట్ర నాయకుడు అన్నమనేని జగన్‌మోహన్‌రావు ఎన్నిక పరిశీలకుడుగా వ్యవహరించారు. ఫణికుమార్‌ను చెన్నారావుపేట రెవెన్యూ కార్యాలయ సిబ్బంది శనివారం శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ గూడూరు రజని, సీనియర్ సహాయకుడు కొండమల్ల రవి, గిర్దావర్లు రషీద్, మమత, సర్వేయర్ విద్యశ్రీ, ఎంపీఎస్ఓ రవళి, జూనియర్ అసిస్టెంట్లు అమ్జద్, శ్రావణ్, రాజు, సంతోష్, శోభ, రికార్డ్ అసిస్టెంట్లు కోటి, శ్రీను, కంప్యూటర్ ఆపరేటర్లు సామ్రాట్, క్రాంతి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో జేఏసీ ఎన్నిక


చైర్మన్ రంగయ్య


వైస్ చైర్మన్ వేణు

నర్సంపేట : స్థానిక ఆర్టీసీ డిపోకు చెందిన వివిధ యూనియన్ల నాయకులు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం డిపో జేఏసీని ఎన్నుకున్నారు. చైర్మన్‌గా స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) కమిటీ అధ్యక్షుడు కొలిశెట్టి రంగయ్య, వైస్ చైర్మన్‌గా తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ (టీజేఎంయూ) డిపో సెక్రటరీ గొలనకొండ వేణు, కన్వీనర్లుగా స్వామి(టీఎంయూ), పాలన్ (ఈయూ), బూర ప్రవీణ్‌కుమార్, కందికొండ మోహన్, బొడిగె రాజు, జానీ పాషా, మంద రాజు, సామల అశోక్‌కుమార్, డ్యాగల వెంకట్రామనర్సయ్య, రాజాలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జేఏసీ కార్యవర్గాన్ని అన్ని యూనియన్ల నాయకులు అభినందించారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక



పర్వతగిరి : మండలంలోని చింతనెక్కొండ మాజీ ఎంపీటీసీ, పర్వతగిరి మాజీ ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు దబ్బెట యాలాద్రి బీజేపీకి రాజీనామా చేసి బీఆర్‌ఎస్ పార్టీలో శనివారం చేరారు. ఈ సందర్భంగా వారికి చింతనెక్కొండ మాజీ సర్పంచ్ సుష్మా మహేష్ కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించి మాట్లాడారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలతో విసిగిన ప్రజలు బీఆర్‌ఎస్ వైపు చూస్తున్నారని చెప్పారు. మళ్లీ బీఆర్‌ఎస్‌కు పూర్వవైభవం రానుందని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు, కల్లెడ సొసైటీ చైర్మన్ మోటపోతుల మనోజ్‌గౌడ్, ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ మాజీ డైరెక్టర్ బోయినపల్లి యుగంధర్‌రావు, నాయకులు చింతపట్ల సోమేశ్వర్‌రావు, చిన్నపాక శ్రీనివాస్, మాదుగుల రాజు, ధర్మోజు దేవేందర్, బొట్ల భాస్కర్, నాగుల బాబు, చేదురి తిరుపతి, దబ్బెట నరేశ్, రంగు కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతో విద్యుత్ ప్రమాదాల నివారణ

- తరచూ ప్రమాదాలు
- తడిచిన స్తంభాలు, సపోర్టింగ్ తీగలను తాకితే ప్రాణాపాయం

వర్ధన్నపేట : జిల్లాలో కొద్దిరోజులుగా అకాల వర్షాలు, ఈదురు గాలులకు విద్యుత్ తీగలు, స్తంభాలు కిందపడిపోతున్నాయి. వాటి కారణంగా ఎక్కడో ఒక చోట విద్యుత్ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. తడిసిన స్తంభాలు, స్టే వైర్లు, సపోర్టింగ్ తీగలు, ఇతర పరికరాలను తాకితే ప్రాణాపాయం కలుగుతుంది. ఇళ్లలో వేలాడదీసే తీగల ఇన్సులేషన్ దెబ్బతినడంతో దండాలు, పైపులకు విద్యుత్ ప్రసారమై మరణాలు చోటుచేసుకుంటున్నాయి. సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో వ్యవసాయ మోటార్లు రైతుల ప్రాణాలను సైతం తీస్తున్నాయి. ఇలాంటి ఘటనల్లో మూగజీవాలు పెద్ద ఎత్తున మృత్యువాత పడుతున్నాయి. కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే ప్రాణాపాయం నుంచి బయట పడొచ్చని విద్యుత్ శాఖ అధికారులు సూచిస్తున్నారు.


విద్యుదాఘాతంతో మృతి చెందిన రైతు (ఫైల్)

పాటించాల్సిన జాగ్రత్తలు

- వ్యవసాయ మోటార్లు, స్టార్టర్లను నేరుగా చేతితో ముట్టుకోవద్దు. మోటార్లు, ఫుట్ వాల్వ్‌లకు సర్వీసు వైర్లు తగులకుండా చూసుకోవాలి.
- ట్రాన్స్‌ఫార్మర్ల ఫ్యూజులు మార్చడం, ఏబీ స్విచ్‌లు నియంత్రించడం కాలిన తీగలను సరి చేయడం ప్రమాదకరం. సమస్యలు తలెత్తితే లైన్‌మెన్‌లకు సమాచారం ఇవ్వాలి.
- చార్జింగ్ పెట్టిన సెల్‌ఫోన్‌ను తడిచేతులతో తాకడం, మాట్లాడడం చేయవద్దు. వర్షాలు కురిసినపుడు స్తంభాలు, స్టే వైర్లు, సపోర్టింగ్ తీగలు, ఇతర విద్యుత్ పరికరాలను చేతితో తాకరాదు.
- తడిసిన తక్కువ ఎత్తులో వేలాడే తీగలు శరీరానికి తగలకుండా జాగ్రత్త పడాలి. దుస్తులు ఆరవేసేందుకు ఇనుప తీగలను వినియోగించవద్దు. నైలాన్ తాళ్లను వాడడం మేలు.
- ఇళ్లలో ఐఎస్ఐ నాణ్యత గల తీగలు, పరికరాలను వాడడం మంచిది. ఎక్కడైనా ఇన్సులేషన్ దెబ్బతిన్నట్లు గుర్తించిన వెంటనే వాటిని మార్చుకోవాలి.
- పొలాల్లోని మోటార్లకు ఎర్తింగ్ చేయించడం ఉత్తమం. ఒక వేళ మరమ్మతులకు గురైతే నైపుణ్యం కలిగిన ఎలక్ట్రీషియన్లతోనే మరమ్మతు చేయించుకోవాలి.
- పశువులను మేతకు తోలుకెళ్లినప్పుడు అవి ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాల దగ్గరకు వెళ్లకుండా చూడాలి.
- ఎవరైనా విద్యుదాఘాతానికి గురైతే వెంటనే అప్రమత్తమై ప్లాస్టిక్ పైపు లేదా ఎండిన కర్రతో రక్షించే ప్రయత్నం చేయాలి.

సొంతంగా మరమ్మతులొద్దు



ఎలాంటి విద్యుత్ సమస్య ఉన్నా వినియోగదారులు, రైతులు సొంతంగా మరమ్మతులు చేయొద్దు. వెంటనే 1912 టోల్ ఫ్రీ నంబర్ సమాచారం ఇవ్వాలి. సమస్య తలెత్తితే లైన్‌మెన్, ఏఈ, డీఈలకు సమాచారం అందించాలి. ఎల్‌సీ తీసుకోకుండా సొంత ప్రయోగాలు చేయొద్దు.

– నటరాజ్, ఏడీఈ, వర్ధన్నపేట

యేసుక్రీస్తు మార్గం అనుసరణీయం

- ఎస్సై గోవర్ధన్

నల్లబెల్లి : ప్రపంచానికి యేసుక్రీస్తు చూపిన మార్గం ఆదర్శమని ఎస్సై గోవర్ధన్ అన్నారు. స్థానిక పాస్టర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో మండలం కేంద్రంలో శనివారం నిర్వహించిన 'రన్ ఫర్ జీసస్' కార్యక్రమాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. యేసుక్రీస్తు బోధనలను అనుసరించాలని సూచించారు. అనంతరం క్రైస్తవులు ప్రధాన వీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. యేసుక్రీస్తు సిలువ మరణ పునరుత్థాన సందేశాన్ని పాస్టర్స్ ప్రకటించారు. యేసుక్రీస్తు బోధనలు, క్రైస్తవుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు నానబోయిన రాజారాం, మాజీ ఎంపీటీసీ జన్ను జయరావు, నాయకులు నాగెల్లి శ్రీనివాస్, బత్తిని మహేష్, క్యాతం శ్రీనివాస్, మానసంపెల్లి అకిల్, మేడిపల్లి రాజు, సామల దేవేందర్, పాస్టర్లు ఈపీ.ప్రసాద్, మత్తయ్య, రూబెన్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవులు

సీసీ రోడ్డు పనుల ప్రారంభం



నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని లింగగిరిలోని పెద్దమ్మగుడి వద్ద సుమారు రూ.5 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్ నాయక్ శనివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్‌రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు చిందం కుమార్, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మంద యాకయ్య, నాయకులు వీరారెడ్డి, మాదారపు భాస్కర్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయండి


నర్సంపేట : సమావేశంలో మాట్లాడుతున్న రవీందర్‌రెడ్డి

- ఆర్‌ఎస్‌ఎస్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ రవీందర్‌రెడ్డి

నర్సంపేట : ఈనెల 27న ఎల్కతుర్తిలో తలపెట్టిన బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని ఆర్‌ఎస్‌ఎస్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ రాయిడి రవీందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు నల్ల మనోహర్‌రెడ్డి, మునిగాల వెంకట్‌రెడ్డి కోరారు. పట్టణంలోని 13, 14వ వార్డుల్లో పట్టణ కమిటీ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణ గౌడ్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో రవీందర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైన విషయమై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. సమావేశంలో బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, క్లస్టర్ బాధ్యులు బండి రమేష్, సీనియర్ నాయకుడు వాసం సాంబయ్య, 13, 14వ వార్డు కమిటీల అధ్యక్షులు ఆబోతు రాజు, నాయిని వేణుచంద్, తదితరులు పాల్గొన్నారు.

దుగ్గొండి : మండలంలోని తిమ్మంపేట, రేకంపల్లి, మహ్మదాపురం, వెంకటాపురం, మందపల్లి, పీజీ తండా, గిర్నిబావి, శివాజీనగర్, మల్లంపల్లి, బొబ్బరోనిపల్లి గ్రామాల్లో నిర్వహించిన సమావేశాల్లో మాజీ జెడ్పీ చైర్మన్ ఆకుల శ్రీనివాస్ మాట్లాడారు. బీఆర్‌ఎస్ హయాంలోనే ప్రజలకు సుపరిపాలన అందిందని చెప్పారు. సభకు కుటుంబ సమేతంగా తరలిరావాలని కోరారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు రాజేశ్వర్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మొగిలి, తదితరులు పాల్గొన్నారు.

ఖానాపురం : మండలంలోని బుధరావుపేట నిర్వహించిన సమావేశంలో మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకటనర్సయ్య మాట్లాడారు. అనంతరం సభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాస ప్రవీణ్, నాయకులు మౌలానా, పాషా, పసునూరి వెంకన్న, ఎల్లయ్య, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



దుగ్గొండి : మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్ జూనియర్ అసిస్టెంట్ మురహరి మధుసూదన్ డాక్టరేట్ అందుకున్నారు. ఆయన సేవలను గుర్తిస్తూ ఏషియన్ ఇంటర్నేషనల్ అండ్ కల్చరల్ రీసెర్చ్ స్ఫూర్తి అకాడమీ నిర్వాహకులు ఈనెల 17న సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో డాక్టరేట్ అందజేసి అభినందించారు. మధుసూదన్ గతంలో బహుజన సేవారత్న అవార్డు అందుకున్నారు. మధుసూదన్‌ను స్కూల్ హెచ్‌ఎం ఎలగొండ రామస్వామి, ఉపాధ్యాయులు పాఠశాలలో శనివారం శాలువాలు, పూలమాలతో సన్మానించారు.


రూ.81 వేల సాయం

సంగెం : మండల కేంద్రానికి చెందిన గట్ల రమేష్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా బాధిత కుటుంబానికి గ్రామ వాట్సప్ గ్రూప్ ద్వారా రూ.81 వేల సాయం అందజేశారు. వాట్సప్ గ్రూప్ ద్వారా పులి రాజశేఖర్, గునిగంటి శ్రీనివాస్ విరాళాలు ఆహ్వానించగా పలువురు స్పందించారు. ఈ మేరకు రమేష్ సతీమణి అనిత, ఇద్దరు కూతుళ్లకు శనివారం రూ.81 వేలు అందజేశారు. కార్యక్రమంలో గ్రూప్ సభ్యులు మునుకుంట్ల శ్రీనివాస్, పులి వీరస్వామి, కోడూరి సదయ్య, ఆగపాటి రాజు, కుమారస్వామి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులపై నిర్లక్ష్యం సరికాదు

- ఫోరం ఉమ్మడి జిల్లా చైర్మన్ రజనీకాంత్

ఖానాపురం : తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులను ఆదుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని తెలంగాణ మలిదశ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి వరంగల్ జిల్లా చైర్మన్ నందగిరి రజనీకాంత్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కుటుంబాలను, ఆరోగ్యాన్ని పక్కన పెట్టి రాష్ట్ర సాధన కోసం ఉద్యమించిన వారిని ఆదుకోవాల్సిన బాధ్యత పాలక పార్టీలపైనే ఉందన్నారు. ఉద్యమకారులు ఆరోగ్యపరంగా, సామాజికంగా భారీగా నష్టపోయారని తెలిపారు. ఉద్యమకారులను ఆదుకునే దిశగా కమిటీ వేయడంతోపాటు ఉద్యమకారులకు ఇంటి స్థలం, పెన్షన్, ఇతర సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం, హక్కుల సాధన ఈనెల 21న హైదరాబాద్‌లో తలపెట్టిన ప్లీనరీని విజయవంతం చేయాలని ఉద్యమకారులను కోరారు. అనంతరం ప్లీనరీ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో ఫోరం జిల్లా కోకన్వీనర్ కందికట్ల జయ, మండల అధ్యక్షులు వీరమల్ల రాములు, మురళీధర్‌రెడ్డి, కొంరయ్య, అనిత, యాకలక్ష్మి, సమ్మక్క, తదితరులు పాల్గొన్నారు.


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఫోరం బాధ్యులు

లారీ డ్రైవర్‌కు గాయాలు

వర్ధన్నపేట : రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని మరో లారీ ఢీకొట్టగా డ్రైవర్‌కు తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని ఇల్లంద సమీపంలో శనివారం చోటుచేసుకుంది. వివరాలిలా.. జాతీయ రహదారి పక్కన నిలిచి ఉన్న లారీని వరంగల్ నుంచి తొర్రూరు దిశగా వెళ్తున్న లారీ తెల్లవారుజామున ఢీకొట్టింది. లారీ ముందు భాగం నుజ్జునుజ్జు కాగా డ్రైవర్ తీవ్ర గాయాలపాలయ్యాడు. క్షతగాత్రుడిని వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

వృద్ధుడికి....

వర్ధన్నపేట : పట్టణానికి చెందిన వృద్ధుడు కంజర్ల శంకరయ్య అంబేడ్కర్ సెంటర్ వద్ద రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొట్టడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. బైక్ నడుపుతూ ప్రమాదానికి కారణమైన యువకుడిని స్థానికులు చితకబాది పోలీసులకు అప్పగించారు. శంకరయ్యను 108 అంబులెన్స్‌లో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

పర్వతగిరి : రోళ్లకల్, గోరుగుట్టతండా, జమలాపురం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సొసైటీ చైర్మన్ భానోతు వెంకన్ననాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులందరికి అందుబాటులో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సొసైటీ సీఈఓ రామ్మూర్తి, సిబ్బంది లింగయ్య, భాస్కర్, మోహన్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

'గ్రీన్ ఒలింపియాడ్' సర్టిఫికెట్ల ప్రదానం

నర్సంపేట రూరల్ : సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో గత నవంబర్‌లో నిర్వహించిన గ్రీన్ ఒలింపియాడ్ టెస్ట్‌లో ప్రతిభ చాటిన బాలాజీ టెక్నో స్కూల్ విద్యార్థులు ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ స్కూల్ ఆవరణలో శనివారం సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడారు. 10 మంది విద్యార్థులు మెరిట్, 173 మంది పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందుకున్నట్లు తెలిపారు.

'సఖి' సేవలపై అవగాహన

గీసుకొండ : మండలంలోని శాయంపేట హవేలి, గీసుకొండ గ్రామాల్లో వరంగల్ సఖి సెంటర్, సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులకు సఖి కేంద్రాల ద్వారా అందుతున్న సేవలపై శనివారం అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా లీగల్ కౌన్సెలర్ శోభారాణి మాట్లాడారు. మహిళల హక్కులు, రక్షణ చట్టాలపై కరపత్రాలతో వివరించారు. బాధితులు సఖి కేంద్రం సేవలను వినియోగించుకోవాలని కోరారు. కేస్ వర్కర్ తిరుమల తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా స్వాధీనం

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ పరిధిలోని జాన్‌పాకలో ఎక్సైజ్ పోలీసులు శనివారం 5 లీటర్ల గుడుంబాతోపాటు గుడుంబా తయారీకి వినియోగిస్తున్న 25 కిలోల చక్కెర స్వాధీనం చేసుకున్నట్టు పరకాల ఎక్సైజ్ స్టేషన్ సీఐ తాతాజీ వివరాలు తెలిపారు. అలాగే 500 లీటర్ల చక్కెర పానకాన్ని ధ్వంసం చేసి గుడుంబా తయారీకి పాల్పడుతున్న బాదావత్ శ్రీను, సురేశ్‌లపై కేసు నమోదు చేశామని చెప్పారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై జ్యోతి, సిబ్బంది లక్ష్మణాచారి, రవీందర్, సమ్మయ్య, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు నివారణ టీకా వేయించాలి

నెక్కొండ : పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీశ్‌రెడ్డి కోరారు. మండలంలోని గుండ్రపల్లిలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. పశువులకు టీకాలు వేయిస్తే రోగాల బారి నుంచి కాపాడవచ్చని చెప్పారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి మమత, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

పర్వతగిరి : చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందిన ఘటనలో మండలంలోని కొంకపాకలో చోటు చేసుకుంది. ఎస్సై బోగం ప్రవీణ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బొక్కల దేవేందర్ (30) ఈనెల 17న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబీకులు అతడిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పెన్షన్ విభాగంలో విచారణ

సంగెం : కొందరు పెన్షనర్లు 3 నెలలుగా పెన్షన్ తీసుకోని విషయమై మండల పరిషత్ కార్యాలయంలో డీఆర్‌డీఏ ఏపీఓ పరమాత్మ శనివారం విచారణ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలో 7287 మంది వివిధ రకాల పెన్షన్‌దారులుండగా 1209 మంది వరుసగా మూడు నెలల నుంచి పెన్షన్ తీసుకోవడం లేదన్నారు. ఆ విషయమై విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని కోరారు. అనంతరం ఎంపీడీఓ కాసర్ల రవీందర్ మాట్లాడారు. పెన్షన్ తీసుకోని వారి విషయమై పంచాయతీ కార్యదర్శులు విచారణ చేసి ప్రభుత్వానికి నివేదిక ఇస్తారని చెప్పారు. కుటుంబాన్ని పోషించే వ్యక్తి వడదెబ్బ, ఇతర ఏ కారణాలతో మరణించినా నిరుపేద కుటుంబాలకు జాతీయ కుటుంబ సంక్షేమ పథకం (ఎన్‌ఎఫ్‌బీఎస్) ద్వారా రూ.20 వేల సాయం అందుతుందని చెప్పారు. వైకల్య ధ్రువీకరణ, రెన్యూవల్ పత్రాల కోసం యూడీఐడీ పోర్టల్‌లో, మీ సేవాలో అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.


మాట్లాడుతున్న ఏపీఓ పరమాత్మ

పౌష్టికాహారంతో ఆరోగ్య పరిరక్షణ


రాయపర్తి : మందులు అందజేస్తున్న వైద్యాధికారి


గీసుకొండ : పౌష్టికాహారం అందిస్తున్న డాక్టర్

- ఆయుష్ వైద్యాధికారి ఉషారాణి

రాయపర్తి : పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని ఆయుష్ మండల వైద్యాధికారి డాక్టర్ ఉషారాణి స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని బాలికల ప్రాథమిక పాఠశాలలో, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆ విభాగం ఆధ్వర్యంలో 'పోషణ్ పక్వాడ్' పక్షోత్సవాల్లో భాగంగా గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలకు పౌష్టికాహారంపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉషారాణి మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆయుష్ సిబ్బంది శ్రీలక్ష్మి, విష్ణు, కల్పన, ఏఎన్‌ఎం వనిత, అంగన్‌వాడీ టీచర్లు చంద్రకళ, గారె కవిత, ఆశా వర్కర్లు రాజేశ్వరి, రజిత, రజియా, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

గీసుకొండ : మండలంలోని ఎలుకుర్తి హవేలీలో నిర్వహించిన కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు, చిన్నారులకు రక్తహీనత నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. అనంతరం పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ మైదం రాజు, మాజీ ఎంపీపీ బీమగాని సౌజన్య, యోగా ఇన్‌స్ట్రక్టర్ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలపై అవగాహన అవసరం

- అగ్నిమాపక అధికారి జయపాల్‌రెడ్డి

వర్ధన్నపేట : అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమాజంలోని ప్రతిఒక్కరికీ అవగాహన అవసరమని స్థానిక అగ్నిమాపక అధికారి జయపాల్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని సినిమా టాకీస్ వద్ద అగ్నిప్రమాదం చోటు చేసుకున్నప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై ఆ శాఖ సిబ్బంది శనివారం మాక్ డ్రిల్ నిర్వహించి సినిమా టాకీస్ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక అధికారి జయపాల్‌రెడ్డి కరపత్రాలు, పోస్టర్లతో వివరించారు. అగ్నిప్రమాదం చోటు చేసుకుంటే అగ్నిమాపక సిలిండర్లు ఎలా ఉపయోగించాలి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ప్రాణాపాయం సంభవించకుండా చూసే విధానాలను వివరించారు. మహేశ్వర రైస్ మిల్లులోనూ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ సిబ్బంది రవీందర్, దేవేందర్‌రెడ్డి, అజ్మీర్ పాషా, గోపాల్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ప్రజాసంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ పాలన

- పార్టీ మండల అధ్యక్షుడు మాధవరెడ్డి

సంగెం : రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాసంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తోందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి తెలిపారు. మండలంలోని షాపూర్‌లో శనివారం నిర్వహించిన 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్' పాదయాత్రకు ఆయన హాజరై మాట్లాడారు. గ్రామాన్ని ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా వంటి పథకాలు అమలు చేసిందని గుర్తు చేశారు. మహిళలకు ఉచిత బస్సు, పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీకి, రైతు రుణమాఫీ, గ్యాస్ సిలిండర్‌పై రూ.500 సబ్సిడీ, తదితరలు అందిస్తున్నట్లు వివరించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేస్తామని తెలిపారు. రాజ్యాంగ సవరణకు కేంద్రంలోని బీజేపీ చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని కోరారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ యాకూబ్, నాయకులు రమేష్, కేశవులు, నాగరాజు, నర్సింహ, సంధ్య, జగన్నాథచారి, కిశోర్, పేరాల రాజు, దొనికెల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీలో మాట్లాడుతున్న మాధవరెడ్డి

సమాజ నిర్మాణంలో కవులు కీలకం

- ప్రముఖ కవి అన్వర్

నర్సంపేట : మెరుగైన సమాజ నిర్మాణంలో కవుల పాత్ర కీలకమని ప్రముఖ కవి అన్వర్ అన్నారు. పట్టణంలోని లీడ్ గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమకర్త కాసుల రవికుమార్ శోభారాణి దంపతులు శనివారం నిర్వహించిన పాఖాల కవుల ఆత్మీయ సమ్మేళనంలో తొలుత కవులు కవులు కేతిరెడ్డి యాకుబ్‌రెడ్డి, కాసుల రవికుమార్, బండారి రాజ్‌కుమార్, పుచ్చ కుమారస్వామి, చిట్ల ప్రేమ్‌కుమార్, రాపాక శ్రీనివాస్, కొయ్యడి శ్రీనివాస్, గన్నారపు సదానందం, భానోతు నర్సింహ, కార్తీకరాజు, సిద్ధ కుమార్, కళ్యాణి కుంజ, బండారి దిలీప్ కవితలు వినిపించారు. కవితా పఠనం, నూతన రచనల పరిచయం, సామాజిక అంశాలపై చర్చలపై సూచనలు అందించారు. ఈ సందర్భంగా కవి అన్వర్ మాట్లాడారు. పాఖాల కవుల ప్రయత్నం చరిత్రలో నిలిచిపోతుందని చెప్పారు. మరింత పదునైన కవిత్వంతో ముందుకు రావాలని ఆకాంక్షించారు.

రహదారులపై పంట ఉత్పత్తులు ఆరబెట్టొద్దు

- ఎస్సై నరేశ్

సంగెం : రహదారులపై మొక్కజొన్న, ధాన్యం, తదితర పంట ఉత్పత్తులు ఆరబెట్టొద్దని ఎస్సై ఎల్.నరేష్ రైతులను కోరారు. మండలంలోని ఎల్గూర్‌రంగంపేట చెరువు మత్తడిరోడ్ వద్ద రైతులు ఆరబోసిన మొక్కజొన్నను శనివారం ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. రోడ్లపై మొక్కజొన్నలు, వరి ధాన్యం ఆరబోయడం వల్ల ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడి మృతి చెందిన ఘటనలో బాధ్యులైన కేసులు నమోదైన విషయాన్ని గుర్తు చేశారు. రైతులు రోడ్లపై కాకుండా వాహనాల రాకపోకలు ఉండని ప్రాంతాల్లో ఆరబోసుకుని రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని స్పష్టం చేశారు.


మొక్కజొన్నలను పరిశీలిస్తున్న ఎస్సై నరేశ్